## ఇంజినీరింగ్‌లో 5019 సీట్లు ఖాళీ

- **ముగిసిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్**

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎప్‌సెట్-2024 సెకండ్ విడత కౌన్సెలింగ్‌లో ఇంజినీరింగ్‌లో 5019 సీట్లు మిగిలాయి. 86,509 సీట్లకుగాను 81,490 సీట్లు భర్తీ అయ్యాయని బుధవారం కన్వీనర్ దేవసేన తెలిపారు. సెకండ్ విడతలో 2788 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. తొలి విడతలో సీట్లు పొంది, సెకండ్ విడతలో 22,848 మంది స్లైడ్ అయ్యారు. సెకండ్ విడతలో ఆప్షన్లు నమోదు చేసుకుని సీట్లు పొందనివారు 9,084 మంది ఉండగా, ఈడబ్ల్యూఎస్ కోటాలో 6,476 మంది సీట్లు పొందారు. 87 ఇంజినీరింగ్ కాలేజీల్లో 100 శాతం సీట్లు భర్తీ కాగా, వాటిలో 7 ప్రభుత్వ కాలేజీలు . సెకండ్ విడతలో సీట్లు పొందినవారు రిపోర్టింగ్‌కు రేపటివరకు గడువు విధించారు.

## 'పాలిటెక్నిక్'కు నో డిమాండ్

- **సర్కారీ కాలేజీల్లో 2981, ప్రైవేటులో 7,586 సీట్లు ఖాళీ**
- **ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్**

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్ కాలేజీలలో డిమాండ్ బాగా పడిపోయింది. పాలిసెట్‌లో సీట్ల భర్తీకి 27, 28న ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ అంతంత మాత్రంగానే నిండాయి. బుధవారం పాలిసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు చేశారు. 114 కాలేజీలలో 29,160 సీట్లకు, కేవలం 19,043 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తంగా 10,567 సీట్లు మిగిలిపోయాయి. 57 ప్రభుత్వ కాలేజీలలో 2,981 సీట్లు భర్తీకి నోచుకోలేదు.

## ఇంటర్ అడ్మిషన్లకు 20 వరకు గడువు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): పదోతరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో సెకండ్ విడత అడ్మిషన్లు పొందడానికి ఆగస్టు 20 వరకు అవకాశం కల్పించారు. వివరాలకు tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని బోర్డు సెక్రటరీ తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి అఫిలియేషన్ పొందిన కాలేజీలలో మాత్రమే అడ్మిషన్లు పొందాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు.





కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన ముగింపు సభలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్.. ఐక్యత చాటుతున్న బీసీ సంఘాల నేతలు

# కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- **మాట తప్పితే గాంధీభవన్, ఏఐసీసీ కార్యాలయాల ముట్టడి**
- **బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

కరీంనగర్ తెలంగాణచౌక్, జూలై 31: అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కోర్టు కేసు అడ్డం కుల పేరిట రిజర్వేషన్లు కల్పించకుండా కాలయాపన చేస్తే గ్రామస్థాయి నుంచి పోరాటాలు చేస్తామని స్పష్టంచేశారు. ఆగస్టు 9న ఏఐసీసీ కార్యాలయాన్ని, ఏ క్షణంలోనైనా గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ రాజ్యాధికారం కోసం బీసీ కుల సంఘాలన్నీ ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న కామారెడ్డి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బీసీ సమగ్ర కులగణన సాధన యాత్ర ముంగిపు సభను బుధవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశ జనాభాలో 62 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో నిధులు తక్కువ కేటాయించడం బీసీలను విస్మరించడమేనని విమర్శించారు. కులగణన చేపట్టకుండా బీజేపీ కుట్రలు చేస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి చెందిన బీసీ కేంద్ర హోం సహాయశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ బీసీ కులగణన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న కాంగ్రెస్ రిజర్వేషన్ల విషయంలో వెనక్కిపోతే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ సమక్షంలో మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి కృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ సాంబశివరావుకు వీడ్కోలు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఆయనకు తెలంగాణ హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అధ్యక్షతన మొదటి కోర్టు హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులంతా హాజరయ్యారు. జస్టిస్ సాంబశివరావు నాయుడు అందించిన న్యాయ సేవలను సీజే కొనియాడారు. ఆయన విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. జస్టిస్ సాంబశివరావు నాయుడు కుటుంబసభ్యులతోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ సాంబశివరావు నాయుడు, సూర్యవాణి దంపతులను హైకోర్టు బార్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ చైర్మన్ అయ్యపు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ శ్యాం కోసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జస్టిస్ సాంబశివరావు నాయుడు పదవీ విరమణతో ప్రస్తుతం హైకోర్టులో సీజేతో కలిపి 27 మంది న్యాయమూర్తులు ఉన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావుకు వీడ్కోలు పలుకుతున్న న్యాయమూర్తులు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హైకోర్టు సీజే అలోక్ అరాధే, సీఎం రేవంత్

## గవర్నర్‌గా జిష్ణుదేవ్‌వర్మ బాధ్యతలు

- **ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే**
- **రాష్ట్ర నాలుగో గవర్నర్‌గా నియామకం**

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గవర్నర్‌గా త్రిపురకు చెందిన జిష్ణుదేవ్‌వర్మ బుధవారం ప్రమాణం చేశారు. రాజ్‌భవన్ వేదికగా రాష్ట్రానికి నాలుగవ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిష్ణుదేవ్‌వర్మతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, నేతలు హాజరయ్యారు. జిష్ణుదేవ్ వర్మ 1957 ఆగస్టు 15న త్రిపురలోని రాజకుటుంబంలో జన్మించారు. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో ఆయన బీజేపీలో చేరారు. నాటి నుంచి పార్టీకి విధేయుడిగా ఉన్నారు. 2018 నుంచి 2023 వరకు త్రిపుర డిప్యూటీ సీఎంగా పనిచేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్‌గా సేవలందించారు. నిరుడు జరిగిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. జిష్టుదేవ్ వర్మ రచయిత కూడా. 'వ్యూస్, రివ్యూస్ అండ్ మై పోయమ్స్' అనే పుస్తకాన్ని రచించారు. ఇటీవలే దానిని ఆవిష్కరించారు.

## అనైక్యత వల్లే రాజ్యాధికారం దూరం

- **బీసీ జనగణన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాలి**
- **బీసీ మేధావులు కార్యాచరణ రూపొందించాలి**
- **మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**



ఖైరతాబాద్, జూలై 31: భారత్‌లో మహాత్మా జ్యోతిబాపూలే ప్రారంభించిన ఉద్యమం నేటికీ కొనసాగుతూనే ఉందని, దేశంలో అనేక ప్రభుత్వాలు వచ్చినా బీసీలకు రాజ్యాధికారం ఇవ్వలేదని, రాజ్యాంగం రాసేటప్పుడు కూడా అనైక్యత వల్లే వెనుబడిపోయామని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో హోటల్ తాజ్‌కృష్ణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన చేతిలో బలం పెట్టుకొని ఓట్లు మాత్రం ఇతరులకు వేస్తున్నామన్నారు. దేశంలో 3,300 పైగా ఉన్న వెనుకబడిన కులాల్లో ఎప్పుడైతే చైతన్యం వస్తుందో అప్పుడే రాజ్యాధికారం వస్తుందని చెప్పారు. కులగణన ఒక రాష్ట్రంలో చేస్తే సరిపోదని, ఇందుకు పూర్తి స్థాయిలో రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. బీహార్‌లో చేసినా హైకోర్టు కొట్టేసిందని, హైదరాబాద్‌లో గతంలో ముల్కీ రూల్స్ అమలు చేయాలని రాజ్యాంగ సవరణ చేస్తే అది అమలుచేయకుండా చేశారని గుర్తుచేశారు. దేశ జానాభాలో 80 శాతం ఉన్న బీసీలు గట్టిగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తే రాజ్యాంగ సవరణ ఎందుకు కాదని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ జరిగితే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కొందరు తమ రాజకీయ మూలాలు కదులుతాయన్న ఉద్దేశంతో, ప్రజల్లో మార్పు వస్తుందన్న భయంతో ఈ అంశాన్ని పక్కనపెడుతున్నారని చెప్పారు. బీసీ జనగణనపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో తీర్మానం చేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని తెలిపారు. గతంలో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బీసీ గణన చేస్తామని తొలుత చెప్పారని, తిరిగి సుప్రీంకోర్టులో తాము చేయబోమని పిటీషన్ దాఖలు చేశారని చెప్పారు. ఇలాంటి సమావేశాలు ఉమ్మడి పది జిల్లాల్లో కూడా పెట్టాలని, తర్వాత నియోజకవర్గ, గ్రామీణ స్థాయిలో నిర్వహించాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ స్థాయిలో చర్చలు నిర్వహించాలని చెప్పారు. సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీపీ ఎందుకు కాలేకపోతున్నామన్న ఆలోచన అక్కడి ప్రజలకు రావాలన్నారు. కులగణన విషయంలో తెలంగాణ నుంచే అగ్గి రాజేయాలని, అది దేశ స్థాయిలో వ్యాపించాలని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను పోస్ట్‌పోన్ చేసి కులగణన చేసిన తర్వాతే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఏసీబీకి చిక్కిన ఎస్టీవో

- **సాఫ్ట్‌వేర్ కంపెనీ అసెస్‌మెంట్ కోసం లంచం డిమాండ్**
- **రూ.2 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన శ్రీధర్‌రెడ్డి**



2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎస్టీవో శ్రీధర్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, జూలై 31 : కంపెనీ ఆస్తుల అసెస్‌మెంట్ కోసం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ వాణిజ్య పన్నుల శాఖ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ ఏసీబీకి చిక్కాడు. రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌కు చెందిన శ్రీకాంత్.. తన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆస్తుల అసెస్‌మెంట్ కోసం పంజాగుట్ట సర్కిల్-1 స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డికి దరఖాస్తు చేశారు. సదరు దరఖాస్తు ఫార్మాట్ సరిగా లేదని ఎస్టీవో శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసులు పంపించారు. శ్రీకాంత్ డ్యాక్యుమెంట్లు సరిగానే అందజేశానని తెలుపగా.. రూ.3 లక్షలు లంచం ఇవ్వాలని అధికారి డిమాండ్ చేశాడు. దీంతో రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్న శ్రీకాంత్ ఏసీబీని ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు బుధవారం అబిడ్స్‌లోని కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్‌లో శ్రీకాంత్ నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఎస్టీవో శ్రీధర్‌రెడ్డిని పట్టుకున్నారు. శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు.


